




రెండు రెక్కలతో దర్శనమిస్తున్న పనిచేయని ఫ్యాను

● కంపు కొడుతున్న గదులు

పూతలపట్టు మండలం పి.కొత్తకోట ఎస్సీ హాస్టల్లో కంపు కొడుతున్న గదుల్లో పేద పిల్లలు నరకయాతన అనుభవిస్తున్నారు. కప్పుకునేందుకు దుప్పట్లు లేక, ఫ్యాన్లు పనిచేయక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇక్కడ 47 మంది పిల్లలు చదువుకుంటున్నా రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.హాస్టల్‌కు తాగునీటి సౌకర్యం లేదు. పంచాయతీ సిబ్బంది నీరు వదిలినప్పుడే స్నానాలకు, కాలకృత్యాలకు వీలవుతోంది. పాత భవనం కావడంతో గదులు పెచ్చులూడి కంపు కొడుతున్నాయి.ఫ్యాన్లు పనిచేయడం లేదు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. తాగడానికి విద్యార్థులే అరకిలోమీటరు దూరంలో వున్న మినరల్ వాటర్ ట్యాంకు వద్దకు వెళ్ళి నీళ్లు తెచ్చుకుంటున్నారు.



పెచ్చులూడుతున్న శ్లాబ్

పొంచి ఉన్న ప్రమాదం

కార్వేటినగరం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం వస్తే భవనమంతా ఉరుస్తోంది. శిథిలస్థితికి చేరుకున్న ఈ భవనం కూల్చి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది.





తలుపులు లేని కిటికీకి అడ్డుగా ప్లాస్టిక్ సంచులు - వంటగదిలో పెచ్చులూడిపోయిన గోడ

సమస్యల కొలువు

బైరెడ్డిపల్లె ఎస్సీబాలుర హాస్టల్‌లో 60మంది విద్యార్థులున్నారు.పడుకునే గదుల్లో అక్కడక్కడా పైకప్పు పెచ్చులూడిపోయివుంది. కిటికీ తలుపులు దెబ్బతినడంతో విద్యార్థులు ప్లాస్టిక్‌సంచులు అడ్డుగా పెట్టుకుని కాలం గడుపుతున్నారు. వంటగది, ఇతర గదుల్లో ఫ్లోరింగ్ దెబ్బతిని గోడలకు వున్న పెచ్చులూడి పడుతున్నాయి. విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా వుంది. వర్షం వస్తే హాస్టల్ భవనంలో పైకప్పు అక్కడక్కడా నెమ్ము వచ్చి ఉరుస్తోంది.

వసతిలేని గృహాలు

ఆంధ్రజ్యోతి విజిట్

- పెచ్చులూడే పైకప్పులు.. తలుపులు లేని కిటికీలు
- రెండు రెక్కల ఫ్యాన్లు.. గదుల్లో వేలాడే కరెంటు వైర్లు
- సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల నరకయాతన

పేద పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కరువయ్యాయి. ఎక్కడ చూసినా పెచ్చులూడే పైకప్పులున్న భవనాలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తలుపులు లేని కిటికీల కారణంగా దోమలతో సావాసం చేస్తున్నారు. పనిచేయని ఫ్యాన్లతో ఉక్కపోతకు గురవుతున్నారు. గదుల్లో వేలాడే విద్యుత్తు వైర్లతో ఆందోళన చెందుతున్నారు. నిర్వహణ లేని మరుగుదొడ్లలో దుర్వాసనను భరించలేకపోతున్నారు.కొన్నిచోట్ల తాగునీటిని అర కిలోమీటరు దూరం వెళ్లి తెచ్చుకుంటున్నారు. దుప్పట్లు, చాపలు ఇళ్ల నుంచి తెచ్చుకుని పడుకుంటున్నారు.సమస్యలు తీవ్ర స్థాయిలో ఉండడంతో వసతి గృహాల్లోని విద్యార్థుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

●జిల్లాలో 32 ప్రీమెట్రిక్ (3-10 తరగతులు), 12 పోస్ట్ మెట్రిక్ (ఇంటర్ టు పీజీ) వసతి గృహాలున్నాయి. ఈ రెండు రకాల గృహాల్లో 3500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

● ఇన్‌ఛార్జి వార్డెన్లతో ఇబ్బందులు

వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా.. అదనంగా 8 చోట్ల ఇన్‌ఛార్జి వార్డెన్లు పనిచేస్తున్నారు. ఒకరికే రెండు వసతి గృహాల బాధ్యత ఉండడంతో పర్యవేక్షణ కుంటుపడుతోంది. దీనికి తోడు ఉన్న వార్డెన్లు కూడా స్థానికంగా నివాసం ఉండడం లేదు. దీంతో విద్యార్థులకు రాత్రిళ్లు వాచ్‌మెన్లే తోడుగా వుంటున్నారు. పి.కొత్తకోట, ఎల్లంకివారిపల్లె, రామకుప్పం, నగరి, జీడీ నెల్లూరు బాలుర హాస్టళ్లతో పాటు రాయల్‌పేట, గుడిపాల, యాదమరి, పలమనేరు బాలికల హాస్టళ్లకు సమీప హాస్టల్ వార్డెన్లు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు.





తలుపు లేని కిటికీ - వర్షంతో చెమ్మగిల్లిన హాస్టల్ గది

● అరకొర సౌకర్యాలే

చౌడేపల్లె ఎస్సీ హాస్టల్‌లో ఒక గది వర్షం వస్తే కురస్తుండటంతో గోడలు చెమ్మ ఎక్కడం, పై టాప్‌లు పెచ్చులుడి ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులు మర్మత్తులకు గురై సక్రమంగా లేవు, కొన్ని కిటికిలకు దోమ మెస్‌లు సైతం రంధ్రాలు పడి డామేజ్ కావటంతో దోమల సమస్యలు ఉన్నాయి.



పెచ్చులూడుతున్న హాస్టల్ గది

● చీకటిమయం

గుడిపాల బాలికల హాస్టల్ భవనం పైకప్పు పెచ్చులూడుతున్నాయి. మరుగుదొడ్ల తలుపులు సరిగా లేవు. ఫ్యాన్లు ఉన్న మూడు గదుల్లో ఓ ఫ్యాన్ పనిచేయడం లేదు. దుప్పట్లు ఇంటి వద్ద నుంచే తెచ్చుకున్నారు. హాస్టల్ బయట లైట్లు లేకపోవడంతో ఆవరణ మంతా చీకటిగా ఉంది.

● సౌకర్యాల లేమి

పెనుమూరు బాలుర హాస్టల్లో మరుగుదొడ్లకు విద్యుత్తు సౌకర్యం లేదు.ఉగ్రాణంపల్లె హాస్టల్ భవన పైకప్పు వర్షానికి ఉరుస్తోంది. బాలికల హాస్టల్ హాల్‌లో టైల్స్ పాడైపోయాయి. మరుగుదొడ్లలో కొళాయిలు పనిచేయడం లేదు.



హాస్టల్ హాల్‌లో పాడైపోయిన టైల్స్



బాత్రూమ్‌లో పనిచేయని కొళాయి





పడిపోతున్న పైకప్పు పెచ్చులు - బోర్డులేక వేలాడుతున్న విద్యుత్ వైర్లు

● అంధకారంలో హాస్టల్ గది

పుంగనూరు బీసీ హాస్టల్లో విద్యార్థులుండే ఓ గది కరెంట్ సమస్యతో అంధకారంలో ఉంది. ఇక్కడ 7 గదులుండగా ఒక గదిలో కరెంట్ ప్లగ్ బాక్స్ లేక వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి.పాడైన బల్బులు మార్చకపోవడంతో కొద్దిరోజులుగా చీకట్లోనే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. లైట్లున్న చోట చదువుకుని చీకటి గదిలో నిద్రపోతున్నారు.ప్రభుత్వం దుప్పట్లు ఇంతవరకూ ఇవ్వకపోవడంతో పిల్లలు ఇళ్ల వద్ద నుంచే చాపలు, దుప్పట్లు తెచ్చుకున్నారు. హాస్టల్‌లో పలుచోట్ల కిటికీలు తెరవడానికి బోల్టులు లేవు, కొన్నిచోట్ల దోమల నివారణకు వేసిన మెష్ పాడైంది. కొన్నిచోట్ల హాస్టల్ పైకప్పు పెచ్చులూడుతున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సోమలలో భారీ వర్షం

- మళ్లీ కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టులు
- నంజంపేట మార్గంలో స్తంభించిన రాకపోకలు



పెద్దఉప్పరపల్లె వద్ద గార్గేయ నదిపై మళ్లీ కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టు

సోమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 67మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో రెండు కల్వర్టులు కొట్టుకుపోయాయి.వీటిని సందర్శించేందుకు మంగళవారం సోమలకు వచ్చిన కలెక్టర్ సుమిత్ కుమార్ నంజంపేట మార్గంలోని సరస్వతీపురం వద్ద జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవహించి తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోవడంతో పెద్ద ఉప్పరపల్లె గార్గేయ నది వద్దకు వెళ్లలేకపోయారు. దీంతో సోమలలోనే మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గురువారం భారీ వర్షంతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహించి మూడు కల్వర్టులు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పేటూరు, బోనమంద, చిన్నకమ్మపల్లె, దుర్గంకొండ, బసవపల్లె గ్రామాల ప్రజల రాకపోకలకోసం టీడీపీ నేతలు, అధికారులు సోమవారం సాయంత్రం పెద్దఉప్పరపల్లె వద్ద తాత్కాలిక కల్వర్టు పనులు పూర్తిచేశారు. రాకపోకలను పునరుద్ధరించిన నాలుగు గంటల వ్యవధిలోనే పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసి తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయి పలుగ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. చిన్నకమ్మపల్లె వద్ద విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ మోటర్లు నీటమునిగాయి. టమోటా, వరి పొలాల్లో వర్షపు నీరు ప్రవహించి పంట నష్టం జరిగింది. రెడ్డివారిపల్లె మార్గంలో గార్గేయ నది ఉధృత ప్రవాహంతో ప్రజల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పత్రపల్లె వద్దఉన్న మరో మార్గం ద్వారా రెడ్డివారిపల్లె ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సరస్వతీపురం జీడిరేవుల వంక వద్ద నాలుగేళ్ల క్రితం నిర్మించిన తాత్కాలిక కల్వర్టు సోమవారం రాత్రి కొట్టుకుపోవడంతో సోమల - పెద్దఉప్పరపల్లె మార్గంలో ప్రయాణించే బస్సులను సూరయ్యగారిపల్లె, తుగడంవారిపల్లె, పొదలకుంట్ల పల్లె మార్గంలో నడుపుతున్నారు.మంగళవారం పంచాయతీరాజ్ డీడీ చంద్రశేఖర రెడ్డి, మండల అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, తహసీల్దార్ బెన్నిరాజ్, ఎంపీడీవో నారాయణ కొట్టుకుపోయిన కల్వర్టులను పరిశీలించారు. చిన్నకమ్మపల్లె, బోనమంద ప్రాంతాల్లో కూలిన పలు విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి, లైన్‌మెన్ విష్ణువర్ధన రెడ్డి, నవీన్ రాయల్ నాటించారు.



సరస్వతీపురం వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టు



చిన్నకమ్మలపల్లె వద్ద కూలిన విద్యుత్ స్తంభం

పెద్దిరెడ్డి మామిడితోటలో నాటుతుపాకుల స్వాధీనం

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన మామిడి తోటలో నాలుగు నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పులిచెర్ల మండలం మంగళంపేట రిజర్వు ఫారెస్ట్ సమీపంలోని ఎలకడోనిపెంట వద్ద పెద్దిరెడ్డికి మామిడి తోట ఉంది. సోమల మండలానికి చెందిన రెడ్డెమ్మ, గంగులయ్య, భాగ్యమ్మ అక్కడే నివాసం ఉంటున్నారు.మంగళవారం వేకువజామున పోలీసులు వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. నాలుగు నాటు తుపాకులను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రెడ్డెమ్మ, గంగులయ్య, భాగ్యమ్మలను అరెస్టు చేశారు.



నాటు తుపాకులతో సహా ముగ్గురు నిందితుల అరెస్టు చూపుతున్న కల్లూరు పోలీసులు

'ఫైనాన్స్' ఆగడాలకు ఎంపీటీసీ బలి

- జీడీనెల్లూరులో కిడ్నాప్ చేసి నూజివీడు తరలింపు
- చనిపోయినట్లు మరుసటిరోజు భార్యకు ఫోన్

పాలసముద్రం/గంగాధరనెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలకు ఓ ఎంపీటీసీ సభ్యుడు బలైపోయాడు. పాలసముద్రం మండలం నరసింహాపురం పంచాయతీ టీవీఎన్ పురం గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు (50) అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. సోమవారం రాత్రి అంబోదరపల్లె సమీపంలో కొంతమంది జగన్నాథరాజును కిడ్నాప్ చేసినట్లు అతని వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జగన్నాథరాజు కొన్నాళ్ల కిందట నూజివీడుకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి వద్ద జేసీబీ కొనుగోలు చేశారు. నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించడం లేదని కంపెనీకి చెందిన ఐదుగురు సోమవారం జీడీనెల్లూరు చేరుకున్నారు. జగన్నాథరాజుకు ఫోన్ చేయగా.. ఆయన చిత్తూరు నుంచి బైకులో పాలసముద్రం మండలంలోని టీవీఎన్‌పురానికి వస్తున్నట్లు చెప్పారు. దీంతో వారంతా జీడీనెల్లూరు మండలం అంబోదరపల్లె సమీపంలో కాపుకాచి జగన్నాథ రాజును కిడ్నాప్ చేశారు. వాహనాల్లో విజయవాడ తీసుకెళ్లారు. జగన్నాథరాజు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్ జీడీనెల్లూరు పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరేష్,శివ, నాగరాజు, మణి, చంద్రలపై కేసు నమోదు చేశామని..మరికొంతమంది నిందితులున్నారని సీఐ లక్ష్మీనారాయణ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే సీఐ లక్ష్మీనారాయణ మంగళవారం విజయవాడ బయల్దేరి వెళ్లారు.ఇదిలా ఉండగా.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు నూజివీడు నుంచి ఫైనాన్స్ వ్యాపారి జగన్నాథరాజు భార్య రాధికకు ఫోన్ చేసి 'మీ భర్త గుండెపోటుతో మరణించారు'అని సమాచారం ఇచ్చారు. 'అన్ని విధాలా ఆరోగ్యంగా వుండే నా భర్తను ఫైనాన్స్ వ్యాపారులే చంపేశారు'అని రాధిక ఆరోపిస్తున్నారు. మృతుడికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. తమతో కలివిడిగా ఉండే జగన్నాథరాజు మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాలసముద్రం మండలంలోని ఏకైక టీడీపీ ఎంపీటీసీ మరణించడంతో టీడీపీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యాయి.



జగన్నాథరాజు (ఫైల్ ఫొటో)

డిస్టిలరీస్‌లో సీఐడీ తనిఖీలు

- రికార్డులు, కంప్యూటర్లు స్వాధీనం

చిత్తూరు సిటీ/కుప్పం/గుడిపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిస్టిలరీస్‌లో మంగళవారం సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు-మురకంబట్టు బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణ డిస్టిలరీస్, గుడిపాల మండలం పల్లూరు సమీపంలోని మోహన్ డిస్టిలరీస్,కుప్పం పురపాలక సంఘం పరిధిలోని డీకేపల్లె సమీపంలో ఉన్న డిస్టిలరీస్‌లో సీఐడీ డీఎస్పీలు వేణుగోపాల్, పద్మలత ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు స్థానిక ఎక్సైజ్ పోలీసుల సహకారంతో ఈ తనిఖీలు జరిగాయి.సీఐడీ అధికారుల బృందం 2019 అక్టోబరు నుంచీ 2024 మార్చి వరకూ డిస్టిలరీస్‌లో జరిగిన కార్యకలాపాలపై దృష్టి పెట్టినట్టు సమాచారం. ఆ మధ్య కాలంలో ఏయే కంపెనీలకు సంబంధించిన మద్యం తయారు చేశారు? ఏయే కంపెనీలకు ఎంతెంత పరిమాణంలో లిక్కర్ తయారు చేశారు? అన్న వివరాలు సేకరించారు. వాస్తవంగా డిస్టిలరీస్‌కు ఏయే మద్యం రకాల తయారీకి అనుమతులు వున్నాయి? వాటికి అనుగుణంగానే తయారు చేశారా? లేక ఉల్లంఘనలు జరిగాయా? అన్నది ఆరా తీశారు. ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, బ్లెండ్ ఎక్కడి నుంచీ తెప్పించారు? లిక్కర్ తయారీలో వాటిని ఎంత పరిమాణంలో కలిపారు? మిగిలిన స్టాక్‌ను ఏమి చేశారు? అన్న వివరాలు సైతం సేకరించారు. డిస్టిలరీస్‌లో తయారైన మద్యం పరిమాణం, గోదాములకు చేరిన పరిమాణం, వృధా అయిన మద్యం పరిమాణం, ఇవన్నీ పోనూ మద్యం మిగిలివుంటే దాన్ని ఏమి చేశారు? అన్నదానిపైనా దృష్టి సారించారు.డిస్టిలరీస్ నిర్వహణకు సంబంధించి రిజిస్టర్లన్నీ వున్నాయా? అన్నది విచారించారు. వీటన్నింటికీ మించి గత ఐదేళ్ళలో మద్యం బాటిళ్ళ క్యాప్‌లపై వేసే సీళ్ళు ఎక్కడి నుంచీ తెప్పించారు? ఎంత పరిమాణంలో తెప్పించారు? ఎన్ని బాటిళ్ళకు వాడారు? సీళ్ళు మిగిలాయా? మిగిలివుంటే వాటిని ఏమి చేశారు? అన్న దానిపై లోతుగా విచారణ సాగించారు. కీలకమైన రికార్డులు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు.



మోహన్ బేవరేజస్‌లో తనిఖీలు



కుప్పం డిస్టిలరీ వద్ద ఫైళ్లను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

బాహుదాకు సారె సమర్పణ



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాణిపాకం సమీపంలోని బాహుదానది ప్రవహిస్తోంది. దీంతో మంగవారం వరసిద్ధుడి ఆలయం నుంచి సారెను సిబ్బందితో కలిసి బాహుదానది వద్దకు ఈవో గురుప్రసాద్ తీసుకెళ్లి సమర్పించారు. ఆలయ అర్చక, పండితులు నదికి పూజలు చేసి.. పసుపు,కుంకుమ, పూలు, గాజులతోపాటు చీరను నదిలో విడిచి పెట్టారు. బాహుదానది ప్రవహించిన తొలిరోజున ఆలయం తరఫున సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి

కొర్లగుంటవారిపల్లె ప్రాజెక్టుకు జలకళ



సదుం మండలం తిమ్మానాయనపల్లె పంచాయతీ పరిధిలోని కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. సదుం, సోమల సరిహద్దు అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జోరుగా ప్రాజెక్టులోకి వరద నీరు ప్రవహించింది. దీంతో ప్రాజెక్టు పూర్తిగా నిండి మొరవపోతోంది. ప్రాజెక్టు నిండిన సందర్భంగా స్థానికులు, కొర్లకుంటవారిపల్లె మహిళలు గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ ఏడాది పంటల సాగుకు నీటి కొరత ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సదుం, ఆంధ్రజ్యోతి



అలిపిరి నుంచి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని తిరుమల క్షేత్రానికి కాలినడకన చేరుకోవాలంటే 3,550 మెట్లు ఎక్కాల్సిందే. గోవింద నామస్మరణ చేసుకుంటూ, చెమటలు తుడుచుకుంటూ, కష్టాన్ని మర్చిపోయేలా స్వామి రూపాన్ని తలచుకుంటూ అడుగులేస్తున్న భక్తులకు ఏడో మైలురాయి వద్ద నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం తారసపడుతుంది. తిరుమల దగ్గరకు చేరుకుంటున్నామనే భావనా కలుగుతుంది. నడక మార్గంలో భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు వెనుక ఆసక్తికర పరిణామమే ఉంది.

1979లో ఏమైందంటే..

1990 వరకు దట్టమైన అడవి మధ్యలోనే తిరుమల క్షేత్రం ఉండేది. అలిపిరి కాలినడక మార్గంలో 1970 వరకు రోజుకు 400 నుంచి 500 మంది భక్తులు రావడమే ఎక్కువ. 1979లో ఏడోమైలు రాయి వద్ద ఓ మహిళ హత్య అప్పట్లో కలకలం సృష్టించింది. హత్య వివరాలు స్పష్టం కానప్పటికీ కాలినడక భక్తులను ఈ ఘటన ఆందోళనకు గురిచేసింది. అప్పటి టీటీడీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి నేరాలకు ఆస్కారముందని గ్రహించారు. దీంతో ఈ మార్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వయంగా నడిచి లోటుపాట్లను గుర్తించారు. ఎగుడుదిగుడుగా ఉన్న రాళ్లను సరి చేయించారు. తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు. లైటింగ్ పెంచుతూ అక్కడక్కడ దుకాణాలు ఏర్పాటు చేయించారు. గోవిందనామస్మరణను గుర్తుచేసేలా బోర్డులు పెట్టించారు. నడకభక్తులకు లగేజి భారం తగ్గించేలా చూశారు. లగేజీ ఉచిత సరఫరా, పైకప్పు ఏర్పాటు లాంటి అభివృద్ధి పనులకు నాటి ఘటన కారణమైంది. ఫలితంగా ఏడాది వ్యవధిలోనే కాలినడక భక్తుల సంఖ్య నాలుగైదువేలకు పెరిగింది. అయినప్పటికీ ఏడో మైలు రాయి హత్యోదంతం పీవీఆర్కే ప్రసాద్ మదిని తొలుస్తూనే ఉండేది.

చేదు స్మృతి చెరిగి... భక్తి భావన పెరిగి..

- భద్రాంజనేయ విగ్రహం ఏర్పాటు నేపథ్యం

పెద్దాపురం శిల్పి సాయంతో...

ఈ క్రమంలో ప్రసాద్ తన సతీమణి గోపిక సొంతూరు కాకినాడ వెళుతున్న క్రమంలో పెద్దాపురంలో 12 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూశారు. వెంటనే కారు ఆపించి భక్తివెలుగులు మూర్తీభవిస్తున్న ఇలాంటి విగ్రహాన్ని తిరుపతిలోనూ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. పెద్దాపురం సమీపాన ఓ గ్రామంలో ఉన్న ఈ విగ్రహ శిల్పి తోగు లక్ష్మణస్వామితో మాట్లాడారు. తొలుత తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేషన్ భవనం(హుజూర్ ఆఫీస్) ముందు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తరువాత అలిపిరిలో గరుత్మంతుడి విగ్రహాన్ని కూడా అద్భుతంగా ఏర్పాటు చేయించారు. ఇన్ని చేస్తున్నా అలిపిరి ఏడోమైలు వద్ద హత్యఘటన, వేదన పీవీఆర్కే ప్రసాద్‌ను వీడలేదు. ఈ క్రమంలో ఆయనకు ఓ పరిష్కార ఆలోచన వచ్చింది. దాని ఫలితమే భద్రాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు. అదే శిల్పి ఆధ్వర్యంలో 1980లో ఏడోమైలు వద్ద పది అడుగుల పీఠంతో సహా 40 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని నిర్మింపజేశారు. ఇప్పుడు అక్కడ అంజనీపుత్రుడి విగ్రహం చూడగానే భక్తులకు నిండైన భక్తి భావన స్ఫురిస్తుంది. విగ్రహ శిలాఫలకంపై 'శిల్పాచార్య తోగు లక్ష్మణస్వామి' అనే పేరు నేటికీ కనిపిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

భీష్మయ్య నాయుడికి కన్నీటి వీడ్కోలు

- శేషాపురంలో ముగిసిన అంత్యక్రియలు
- పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల నివాళులు



భీష్మయ్యనాయుడుకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శేషాపురంలో మంగళవారం సాయంత్రం టీటీడీ విశ్రాంత హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బొబ్బా భీష్మయ్యనాయుడికి అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆయన మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం ఉదయాన్నే స్వగ్రామమైన శేషాపురానికి తీసుకొచ్చారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక పబ్లిషర్ శేషగిరిరావు, భీష్మయ్యనాయుడు బావమరిది, హైదరాబాదులోని కిమ్స్‌లో సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సీఎస్ నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, టీడీపీ నేతలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌రెడ్డి, బడి సుధాయాదవ్, ఆర్సీ మునికృష్ణ, బీజేపీ నాయకులు సుబ్రమణ్యంయాదవ్, నరేష్‌కుమార్‌నాయుడు, వైసీపీ నేత ఎంఆర్సీ రెడ్డి, టీటీడీ విశ్రాంత జేఈవో శ్రీనివాసరాజు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీఈవో వాసుదేవనాయుడు, మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, మంచు కృష్ణ, నారాయణ విద్యాసంస్థల జీఎం కొండలరావు, సినీనటుడు రఘుబాబు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల మెడికల్ ఆఫీసర్‌గా, నారావారిపల్లె సీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా, టీటీడీ హెల్త్ ఆఫీసరుగా భీష్మయ్య నాయుడు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సాయంత్రం గ్రామస్థులు, అభిమానులు, బంధువులు, రాజకీయ నాయకుల కన్నీటి వీడ్కోలు నడుమ అంత్యక్రియలు జరిగాయి.

ఫోనులో సీఎం చంద్రబాబు పరామర్శ

సీఎం నారా చంద్రబాబునాయుడు ఫోను చేసి భీష్మయ్య నాయుడు కుమారులు బొబ్బా చరణ్‌కుమార్, బొబ్బా కిరణ్‌కుమార్‌ను పరామర్శించారు. భీష్మయ్యనాయుడు మృతికి సంతాపం తెలియజేసారు. టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం కూడా ఫోన్ చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.





భీష్మయ్యనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గల్లా అరుణకుమారి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి - భీష్మయ్యనాయుడు భౌతికకాయాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న దృశ్యం

తిరుపతి ఐఐటీకి నీటి సంరక్షణ అవార్డు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ వ్యవస్థలో 2023 నేషనల్ వాటర్ అవార్డులలో తిరుపతి ఐఐటీ ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్మూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్ చేతుల మీదుగా మంగళవారం న్యూఢిల్లీలో 5వ జాతీయ జల పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి చేతుల మీదుగా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. తమ క్యాంపస్‌లో ఆదర్శవంతమైన నీటి సంరక్షణ వ్యవస్థను అమలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు అందజేసిందని సత్యనారాయణ తెలిపారు.



హీరో పరిశ్రమను సందర్శించిన కమిటీ సభ్యులు

పరిశ్రమలను పరిశీలించిన భద్రతా కమిటీ

సత్యవేడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం సత్యవేడు, శ్రీసిటీలో పలు పరిశ్రమలను తనిఖీ చేసింది. కమిటీ చైర్‌పర్సన్ వసుధమిశ్రా నేతృత్వంలో సుమారు 15 మంది సభ్యులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. మాదనపాళెంలోని హీరో మోటో కార్ప్, వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరులోని అపోలో టైర్స్‌తో పాటు శ్రీసిటీలోని పలు పరిశ్రమలను తనిఖీ చేసి వివరాలను సేకరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హీరో పరిశ్రమలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ పలు సూచనలు చేసింది. జిల్లా.. సత్యవేడు అగ్నిమాపక శాఖ అధికారులు రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయండి



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్ఏఐ పీడీలు, జిల్లా రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. కడప-రేణిగుంట, రేణిగుంట-నాయుడుపేట, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుంచి రేణిగుంట వరకు) ఆరు లేన్ల రహదారి పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులూ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణలో సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించాలని సూచించారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో నాయుడుపేట-తూర్పు కనుపూరు ఆరులేన్ల రహదారి 35.కి.మీ. చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు నాలుగు లేన్ల రహదారి, తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం సౌత్‌గేట్ ఆరు లేన్ల రహదారి 36.కి.మీ., తమ్మినపట్నం నుంచి నారికెళ్లపల్లెను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 4 లేన్లు, పోర్టు రోడ్డు పొడగింపునకు 6లేన్ల రహదారి 16కిలోమీటర్ల పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేప్రాజెక్టు భూసేకరణ కూడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఐఐటీ, ఐసర్‌లో పెండింగ్ భూసేకరణ పూర్తిచేయాలన్నారు. విమానాశ్రయం వద్ద జాతీయ రహదారి పెండింగ్ పనులను వచ్చే నెల 10నాటికి పూర్తిచేస్తామని, రేణిగుంట-నాయుడుపేట రోడ్డును చివరి నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. జేసీ శుభం భన్సల్, గుడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు, జిల్లా సర్వేయర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 362 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- రూ. 3.55 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగలు, నిందితుడిని మీడియాకు చూపి వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీఎస్పీ రమణకుమార్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి భార్యా పిల్లలను అదుపులోకి తీసుకున్నా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో సీఐ చిన్నగోవిందుతో కలిసి క్రైం డీఎస్పీ రమణకుమార్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన శెట్టి మణి, శెట్టి సూర్య అన్నదమ్ములు. కొన్నేళ్ల కిందట హైదరాబాదుకు వలస వెళ్లిన వీరు అక్కడి ఎల్‌బీనగర్ సమీపంలోని శ్రీనివాస కాలనీ, శివనగర్‌లో వేర్వేరుగా కాపురమున్నారు. సులభ సంపాదన.. జల్సాల కోసం వీరు పదేళ్ల కిందట దొంగతనాలకు అలవాటు పడ్డారు. భార్య, బిడ్డలతో కలసి ముందుగా నిర్ణయించిన ప్రాంతాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తారు. భిక్షాటన చేస్తున్నట్లు వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్టుమెంట్లను గుర్తిస్తారు. రాత్రిళ్లు తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడతారు. కాగా, గత నెల 20వ తేదీన ఓటేరు, శ్రీనివాసపురంలోని సురేష్, వెంకట్రాజు, సురేష్ ఇళ్లల్లో భారీ చోరీ జరిగింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ చిన్నగోవిందు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ షేక్ షావలి, క్రైం పార్టీ ఏఎస్ఐ రాఘవ, హెడ్ కానిస్టేబుళ్లు వాసుదేవరావు, రవిప్రకాష్, కానిస్టేబుళ్లు భోభనాద్రి, ప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్, ఆరీఫ్, మునిని ప్రత్యేక బృందాలుగా నియమించారు.

చోరీ కేసులను ఛేదించింది ఇలా..

ఈ తరహా చోరీలు ఎక్కడెక్కడ జరిగాయి? వాటిల్లో నిందితులు ఎవరనే కోణంలో విచారించారు. దీంతో ప్రకాశం జిల్లా కందుకూరు, రావులపాలెం, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ తరహా దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. ఈ నిందితుల ఫొటోలు, మొబైల్ నెంబర్లు సేకరించారు. వీరి కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి రూరల్ రామాంజుపల్లి చెక్‌పోస్టు వద్ద కాపు కాచి ఇద్దరు నిందితులతో పాటు వారి భార్యా, పిల్లలు మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10.31 లక్షల విలువ చేసే 362 గ్రాముల బంగారు నగలు, రూ.3.55లక్షల నగదు, దొంగతనాలకు వినియోగిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శెట్టి మణి, శెట్టి సూర్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన కుటుంబ సభ్యులను తహసీల్దార్ ఎదుట హాజరపరచి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందచేస్తారని డీఎస్పీ చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయండి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని సదరన్ డిస్కం చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్, ఈఈలు రవికుమార్, వాసవీలత, బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు డివిజన్ అధికారులతో వీరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థల్లో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని వారు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా 200 యూనిట్లు దాటిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అమర్చడానికి క్షేత్రస్థాయిలో ఏఈలు నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ కేంద్రాల్లో ఈఈలు వి.చంద్రశేఖర్‌రావు, ఎస్.వాసురెడ్డితో పాటు రెండు డివిజన్ల డీఈఈలు, ఏఈలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఆక్సిలెంట్ ఫార్మాకు హెల్త్ కెనడా అవార్డు



శ్రీసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమకు హెల్త్ కెనడా కరెంట్ గుడ్ మానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (సీజీఎంపీఎస్) సర్టిఫికెట్ దక్కింది. కంపెనీ నాన్ స్టెరైల్ సదుపాయం కోసం ఈ గుర్తింపు అందుకుంది. సెప్టెంబర్ 16-20 తేదీల్లో ఈ సంస్థ పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది. ఈ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉందని పరిశ్రమ చైర్మన్ జితేష్ దేవేంద్ర తెలిపారు. తమ పరిశ్రమలో నాన్-స్టెరైల్ సదుపాయంలోని ఓరల్ సాలిడ్, ఓరల్ లిక్విడ్, సెమి సాలిడ్ ఉత్పత్తులకు సంబంధించి ఈ తనిఖీలు జరిగినట్లు ఆయన వివరించారు. కాగా, హెల్త్ కెనడా సీజీఎంపీఎస్ అనేది ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ, ఆహార ఉత్పత్తులకు సంబంధించి భద్రత, నాణ్యత మార్గదర్శకాలను రూపొందించే సంస్థ.

ఆహ్లాదం ఆనందం

చిత్తూరువాసులకు వరం గంగినేని పార్కు



గంగినేని చెరువు పార్కు

ఆహ్లాదంతో పాటు ఆనందాన్నీ పంచుతోంది చిత్తూరులోని గంగినేని పార్కు. దీన్ని చిత్తూరు నగర పాలక సంస్థ, ఇరిగేషన్‌శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ పార్కుకు ఓవైపు పచ్చదనం పరచుకున్న అటవీ ప్రాంతం, రెండు వైపులా వాకింగ్ ట్రాక్, మధ్యలో గంగినేని చెరువు ఆహ్లాదాన్నిస్తున్నాయి. పెద్దలకు వాకింగ్ ట్రాక్‌తోపాటు జిమ్ అందుబాటులో ఉంది. ప్రత్యేక రోజుల్లో పార్కు ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పిల్లల కోసం థీమ్ పార్కుల తరహాలో ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. సెలవు రోజుల్లో పాప్‌కార్న్ షాపులు, కలంకారీ, చేనేత, ఇతర ఆటవస్తువుల విక్రయాలు సాగుతాయి. డ్వాక్రా మహిళలు సైతం తమ సమావేశాలను ఈ పార్కులో నిర్వహించుకోవడం విశేషం.

చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి



పార్కు పక్కనే చెరువు

పార్కు సమయాలు

- ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- వారాంతంలో మరో గంట పొడిగిస్తారు.

● వాకర్ల కోసం ప్రత్యేక ట్రాక్

కొద్ది దూరం నడిచే వారి కోసం పార్కులోపు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పార్కు చుట్టూ గంగినేని చెరువు కట్టపై ప్రత్యేకంగా మరో వాకింగ్ ట్రాక్ కూడా ఉంది. కట్ట ప్రారంభం నుంచి సబ్‌స్టేషన్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి కనిపిస్తుంటుంది.



పిల్లల కోసం వాటర్ బోట్ పెడలింగ్



చిన్నారుల కోసం ఆటవస్తువులు



● 'హ్యాపీ సండే' పునరుద్ధరించాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గంగినేని పార్కు ఆవరణలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమం జరిగేది.నృత్య కళాకారులు, పాఠశాలల విద్యార్థులతో ప్రతి ఆదివారం ప్రదర్శనలు నిర్వహించే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇది మరుగున పడింది. ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

● చెరువులో బోటు విహారం

టీడీపీ హయాంలో గంగినేని పార్కులో బోట్లు అందుబాటులో ఉండేవి. ఇద్దరికి కలిపి రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు వసూలు చేసేవారు. ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉండేటప్పుడు హాయిగా చెరువులో విహరించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బోట్లను మూలనప డేశారు. కొన్ని మరమ్మతులకు గురవగా, మరికొన్నింటిని ఇరిగేషన్‌శాఖ అధికారుల వద్ద కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి పోయినట్లు సమాచారం. తిరిగి బోట్లను అందుబాటులోకి తెస్తే.. ప్రభు త్వానికి కూడా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ప్రారంభం



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను ఆ ట్రస్టు ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పేద విద్యార్థుల కు అవసరమైన శిక్షణ, ఇతర విద్యా సౌకర్యాలు కల్పించడంకోసం ఎన్టీఆర్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఉచిత డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకుని, డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని యువతకు ఆమె పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వర్చువల్‌గా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఉచిత డీఎస్సీ శిక్షణను అందిస్తున్న భువనేశ్వరికి ధన్య వాదాలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్ర మంలో పాల్గొన్న శిక్షణార్థులకు టీడీపీ నాయ కులు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదో విడతగా ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఇతర వివరాలకు 77999 33370 నెంబరును సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీ ఐలకు దరఖాస్తులు చేసుకున్న వారికి 28న, ప్రైవేటు వారికి 30వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

మొరవ పారుతున్న బీరప్ప చెరువు



మొరవ పారుతున్న బీరప్పచెరువు

ఐరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుపాను కార ణంగా కురుస్తున్న వర్షాలకు ఐరాల మండలంలో అతి పెద్ద చెరువులలో ఒకటైన బీరప్ప చెరువు మొరవ పారుతోంది. మంగళవారం వేకువ జాముకే చెరువు నిండిపోయింది. చెరువుకు మొరవ ప్రారంభం కావడంతో గ్రామస్తులు కూర్పాలు హారతులు పట్టి, కొబ్బరి కాయలు సమర్పించారు. మొరవ పారడంతో గార్గేయ నది వేగంగా ప్రవహిస్తోంది. ఇక తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదని ప్రజలు, రైతులు భావిస్తున్నారు. బీరప్పచెరువును చూడటానికి పరిసర గ్రామస్తులు తరలి వెళుతున్నారు.

ఎన్టీఆర్ జలాశయంలో రెండు గేట్లు ఎత్తివేత

నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు



రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు

పెనుమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి మంగళవారం అధికారులు రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. తవణంపల్లె, ఐరాల, పూత లపట్టు మండలాల్లో కురిసిన వర్షానికి జలాశ యానికి భారీగా నీరు చేరింది. మొత్తం 340 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ జయచంద్రనాయుడు తెలిపారు. జలా శయం నిండటంతో చూడటానికి పర్యాటకులు ఎగబడ్డారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఇరిగే షన్ ఏఈ భరత్‌కుమార్‌లు జలాశయం దిగువ నున్న ప్రజలను అప్రమత్తం చేశారు.

చిరుత హత్య కేసులో ఒకరి అరెస్టు!

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): యాదమరి మండలంలో పులి కళేబ రాన్ని గుర్తించిన ఘటనలో అనుమానితుడైన ఒకరిని అదుపులోకి తీసుకుని, అటవీ అధికా రులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచా రం. పులిని ఓ చేనులో చంపి అటవీ ప్రాం తంలో పడేసినట్లు అనుమానం వ్యక్తం అవు తోంది. సంబంధిత యజమానిని అనుమాని తుడిగా భావించి.. అదుపులో తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో ఎంత మంది పాల్గొ న్నారనే అంశాలపైనా ఆరాతీస్తున్నారు. వీటిపై బుధవారం బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో మరింత లోతుగా విచారణ చేపట్టనున్నారు.

చిన్నారుల గణన ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో ప్రారంభమైన చిన్నా రుల గణన నవంబరు 10వ తేదీ వరకు జరగ నుంది. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టి 0-5, 5-10 సంవత్సరాల పిల్లలను గుర్తిస్తారు. పుట్టిన వారు, చనిపోయినవారు, బయట ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన చిన్నారులను గుర్తిస్తారు. అవసరమైన వారికి టీకాలు వేయనున్నారు. చిన్నారుల తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కోరుతున్నారు.

15 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో కొత్తగా 15 పోలింగ్ కేంద్రాలు (పీఎస్) అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రతిపాదించారు. 1500 ఓట్ల కంటే ఎక్కువగా ఉండడంతో రేషనలైజేషన్ కింద కొత్తగా పోలింగ్ కేంద్రాలు కావాలనే సిఫార్సు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వెయ్యి లోపే ఓటర్లు వున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్‌లో 1,500 ఓట్లలోపే ఉండాలి. అందుకే రేషనలైజేషన్ చేపట్టారు. కొత్తగా 15 పోలింగ్ కేంద్రాలు చేరితే, వీటి సంఖ్య మొత్తం 1,777 అవుతుంది.

---

27 గ్రామసభలు....866 అర్జీలు

జగనన్న భూ రీసర్వేపై ఫిర్యాదుల వెల్లువ



గుడిపాల మండలంలో తన పొలం విస్తీర్ణం తక్కువైందని ఫిర్యాదు చేస్తున్న రైతు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): రెవిన్యూ రికార్డుల్లో కచ్చితత్వం, భూవివా దాలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే తప్పులతడకగా కొనసాగింది. రీసర్వే మొత్తం లోపాలబుట్ట అనేలా పలు ఉదంతాలు జిల్లావ్యా ప్తంగా వెలుగుచూశాయి. వీటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు మంగళ వారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లావ్యా ప్తంగా నాలుగు రెవిన్యూ డివిజన్లలో 329 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, తొలిరోజైన మంగళ వారం 27 గ్రామసభలు జరిగాయి. రైతుల నుంచి లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో ఎక్కువగా విస్తీర్ణం తగ్గిందంటూ అర్జీలు వెల్లువెత్తాయి. తొలిరోజే 866 అర్జీలు రైతుల నుంచి అధికారులు స్వీకరించారు. కొన్ని భూముల వివరాలు అసలు నమోదు చేయకపో వడం, అడంగళ్‌లో వున్న విస్తీర్ణం కంటే తక్కు వగా కొందరికి, ఎక్కువగా కొందరికి నమోదుచే యడం, వ్యాలిడియేషన్ ప్రక్రియ అనంతరం జారీ చేయాల్సిన 9(2) నోటీసులు చాలాచోట్ల ఇవ్వకపో వడంపై కూడా ఫిర్యాదులందాయి. అనేక సర్వే నెంబర్లకు ఒకటే ఎల్‌పీఎం ఇవ్వడం, ఒకే సర్వే నెంబర్‌లో పలువురు వ్యక్తులకు సంబంధించి భూములను సంయుక్త ఎల్‌పీఎం నెంబర్లలో నమోదు చేయడంతో క్రయవిక్రయాలు నిల్చిపో యాయని కూడా ఫిర్యాదులందాయి. వీటిని 15 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా మార్గదర్శ కాలు జారీఅయ్యాయి. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పక్కాగా గ్రామసభలు జరపాలని, హడావుడి లేకుండా గరిష్ఠంగా 120 రోజుల వ్యవధి జిల్లా యంత్రాంగం ఇచ్చింది. అర్జీలను నిరంతరం కలెక్టర్, జేసీ పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేశారు. ప్రత్యేక రెవిన్యూ బృందాలు వీటిలో పాల్గొంటున్నాయి.

తవణంపల్లెలో రికార్డుస్థాయి వర్షం

103.4 మి.మీ నమోదు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. తవణంపల్లె మండ లంలో అయితే రికార్డు స్థాయిలో 103.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలా లవారీగా.. సోమలలో 67, పూతలప ట్టులో 24.4, చౌడేపల్లెలో 19.6, శాంతిపు రంలో 14.6, సదుంలో 14.2, పెద్దపంజా ణిలో 12.6, చిత్తూరులో 12, బైరెడ్డిపల్లెలో 11, యాదమరిలో 10, వి.కోటలో 9, ఐరా లలో 8.2, చిత్తూరు రూరల్‌లో 7.4, కుప్పంలో 4.2, గుడుపల్లెలో 2.6, గంగ వరం, బంగారుపాళ్యంలో 1.2, పెనుమూ రులో 0.6 మి.మీ వర్షం కురిసింది.

పాఠశాల నిర్వహణ నిధులు విడుదల

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 50 శాతం నిధులను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 2,396 పాఠశాల లకు రూ.5.32 కోట్లకుగాను రూ.2.66కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అదే విధంగా మండల రిసోర్స్ సెంటర్లకు సైతం నిధులు కేటాయించింది. జిల్లాలో 31 ఎంఆర్‌సీలు ఉండగా, రూ.1.30 కోట్ల గాను రూ.40.30 లక్షలు విడుదల చేసింది.

బాధితులకు అండగా నిలవండి: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా నిలవాలని సిబ్బందిని ఎస్పీ మణికంఠ ఆదేశిం చారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 27 అర్జీలు వచ్చాయన్నారు. వీటిల్లో.. భూ తగాదాలపై 8, డబ్బు తగాదా లపై 6, కుటుంబ తగాదాలపై 5, ఆస్తి, ఇంటి తగాదాలపై మూడు చొప్పున, వేధింపులు, చీటింగ్‌పై ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలన్నీ పరి ష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

బాహుదానదిపై కొట్టుకుపోయిన వంతెన

- సుమారు 20 గ్రామాలకు రాకపోకలు కట్
- మరో మూడు వంతెనలూ ధ్వంసం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వంకలు, వాగులు



తొడతర వద్ద కొట్టుకుపోయిన వంతెనను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్



అరగొండ-జొన్నగురకల రోడ్డు వద్ద కోతకు గురై కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉన్న వంతెన

తవణంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): తవణంపల్లె మండలంలో సోమవారం రాత్రి రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంక లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా పడమటివైపు సరిహద్దు మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో వరద నీరు మండలానికి వచ్చి చేరి.. బాహు దానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీటి ప్రవాహానికి గాజులపల్లె-తొడతర గ్రామాల వద్ద బాహుదానదిపై నిర్మిం చిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయిం ది.దీంతో సరకల్లు వైపువెళ్లే 20 గ్రామా లకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అరగొండ-జొన్నగురకల రోడ్డు వద్ద ఇదే నదిపై నిర్మించిన వంతెన కూడా 50 శాతానికిపైగా దెబ్బతింది. అరగొండ-గాజులపల్లె రోడ్డులోనూ ఈ నదిపై ఉన్న నిర్మించిన వంతెన, పుణ్య సముద్రం వద్ద నిర్మించిన వంతెనలు కోతకు గురై కొట్టుకుపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ మార్గాల్లో రాకపో కలు సాగించేవారు, పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్.. అధి కారులతో కలిసి కొట్టుకుపోయిన తొడ తర వంతెనను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి గ్రామా లకు రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. వంతెన శాశ్వత నిర్మా ణానికి ప్రతిపాదనలు పంపి.. ఇక ముందు ఇలాంటి సమస్య రాకుండా చూస్తామని చెప్పారు. ఆర్డీవో శ్రీనివా సులు, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్, తహ సీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డి బాబు, డీఈ రాధిక, ఏఈ జయచం ద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌ దరి, టీడీపీ నాయకులు గాలి దిలీప్, భాస్కర్‌నాయుడు, వివిధ శాఖల అధి కారులు పాల్గొన్నారు.

వేలంతో వరసిద్ధుడి ఆలయానికి రూ.94.03 లక్షల ఆదాయం



బహిరంగవేలం నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా వరసిద్ధుడి ఆలయానికి రూ.94,03,116 ఆదాయం లభించింది. ఆలయ కార్యాలయ భవనం వద్ద అధికారులు ఈ వేలాన్ని నిర్వహించారు. 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ముద్రించుకుని విక్ర యించుకోవడానికి రూ.32,10,000 (ఐదు నెలల కాలపరి మితి), లగేజీలు భద్రపరచుకునే హక్కు కోసం రూ.32,76,000 (ఏడాది కాల పరిమితి లైసెన్స్), దుకాణం నెంబరు 28,29లో క్యాంటీన్ నిర్వహణకు రూ.29,17,116 (ఏడాది పరిమితి)తో పాటదారులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ కృష్ణా రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్ బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి శంకరన్‌కు ఘననివాళి



పలమనేరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : జీవితమంతా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన ఐఏఎస్ అధికారి శంకరన్ 90వ జయంతిని మంగళవారం పలమనేరులోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శంకరన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేటి ఐఏఎస్ అధికారులు శంకరన్‌ను ఆదర్శంగా తీసుకుని బడుగు బలహీన వర్గాల వారికి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, బి.మంజునాథ్‌బాబు, గుర్రప్ప, శంకరప్ప, పుంగనూరు సీపీఐ పట్టణ కార్యదర్శి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, అక్టోబరు 22: సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలందరికీ అండగా ఉంటోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. మంగళవారం లింగాపురం గ్రామంలో బందార్లపల్లె, లింగాపురం, కంచిదాసనపల్లె గ్రామ సమాఖ్యల నూతన కమిటీల ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. భవిష్యత్‌లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500 ఆర్థిక సాయం కార్యక్రమాలు అమలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, నాయకులు కోదండరెడ్డి, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చడానికే గ్రామసభలు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు బాబు

రామకుప్పం, అక్టోబరు 22: భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను తీర్చడానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని రామకుప్పం మండల తహసీల్దారు బాబు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొళ్లపల్లెలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూసర్వేలో జరిగిన పొరబాట్లపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరి సమస్యలూ తప్పక పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొళ్లపల్లెబాబు, విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్యం



రామకుప్పం, అక్టోబరు 22: కుప్పం కేసీ హాస్పిటల్ అధినేత డా.మంజునాథ్ ఆధ్వర్యంలో మంగళవారం రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200మంది రోగులకు వైద్యులు చికిత్స అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తమ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిల్ప, క్రితీష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన చొరవ..ట్యాంకు పరిసరాలు శుభ్రం



రామకుప్పం, అక్టోబరు 20: రామకుప్పంలోని దిగువ మసీదు వెనుక గల తాగునీటి ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం జనసేన నేతల చొరవతో తొలగింది. తాగునీటి ట్యాంకు వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై జనసేన నేతలు రెండు రోజుల క్రిత పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు మంగళవారం పారిశుధ్య కార్మికులతో అక్కడ పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హరీష్, తంజీల్, సుబ్బు, భాస్కర్, శ్రీకాంత్, ఆనందరెడ్డి, మురళి, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సదుం, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడి చాలాచోట్ల ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయినట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. చెరుకువారిపల్లె పరిసర ప్రాంతంలో పడిన పిడుగుపాటుకు సమీపంలోని సబ్‌స్టేషన్‌లో ఉన్న 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం వరకు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొత్తట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సదుంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన కోతకొచ్చిన వరి పంట

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. వరి, అరటి, పశుగ్రాసం నాశనమైంది. కోటపల్లి సమీపంలోని తూర్పు అటవీ విభాగంలో పగలంతా మాటు వేసిన ఏనుగుల గుంపు సోమవారం రాత్రి కోటపల్లి సమీపానికి చేరుకున్నాయి. కల్లూరులోని సయ్యద్‌బాషాకు చెందిన ఎకరా వరిపంటను ఏనుగులు తొక్కేశాయి. వారం రోజుల్లో కోత కోయాల్సి ఉండగా పంట మొత్తం కోల్పోయాడు. అక్కడి నుంచి ఏనుగులు కట్టకింద ఇండ్లలోని కేశవులునాయుడుకు చెందిన అరటిచెట్లు, చెరకును తినేశాయి. పశుగ్రాసాన్ని తొక్కేశాయి. కొంగరవారిపల్లిలోని సురేంద్రనాయుడు మామిడితోట ఫెన్సింగ్ కూసాలను విరిచేశాయి. తర్వాత పాతపాళ్యం అడవి వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

టపాకాయల దుకాణాలకు స్థల పరిశీలన

వి.కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాకాయల దుకాణాలకు తహసీల్దార్ పార్వతి నేతృత్వంలో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం అర్బన్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ బాబు, ఆర్ఐ మోహన్‌రెడ్డి పట్టణంలో పలుచోట్ల దుకాణాలకు స్థలాలను పరిశీలించారు. లైసెన్సుదారులు దుకాణాల ఏర్పాటు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలనువివరించారు. ఫైర్, పోలీసుశాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. దుర్గానగర్‌లో దుకాణాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : పలమనేరు టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ, ఇంగ్లీషు, కామర్స్ పాఠ్యాంశాలు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోపు ఆయా సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

రెవెన్యూ గ్రామసభలు ప్రారంభం

కుప్పం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్లనాయని పల్లె పంచాయతీ ఊరినాయనిపల్లె గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులను తహసీల్దారు చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భూసమస్యలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పలు భూ సమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలు సమర్పించారు. ఆర్ఐలు, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



పొలంబడి సభలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, అక్టోబరు 22: మండలంలోని మల్లానూరులో మంగళవారం పొలంబడి గ్రామ సభ జరిగింది. ఇందులో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ అధికారులు వివిధ సాగు విధానాలు, పశు పోషణ తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమృతవల్లి, ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మొరం చెరువును చెరపట్టారు



పలమనేరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం మొరం చెరువులో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ట్రాక్టర్లలో జోరుగా ఇసుక తరలిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే అమర్‌ను కలిసిన జడ్పీ సీఈఓ



పలమనేరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మంగళవారం చిత్తూరు జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువకప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజక వర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి వారు చర్చించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పలమనేరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని సత్యగంగమ్మ, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం హుండీ ఆదాయాలను లెక్కించారు. ఆలయాల కార్యనిర్వాహణ అధికారి కమలాకరన్ భక్తులచే హుండీలోని కానుకలను లెక్కించారు. సత్యగంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.1,02197లు, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి రూ.2,20,618లు భక్తులు కానుకలుగా సమర్పించారు. సత్యగంగమ్మ హుండీలో భక్తులు 5 గ్రాముల బంగారు వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తిమ్మరాజుపల్లె విద్యార్థులు



శాంతిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పలమనేరులో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో 9దవ తరగతి విద్యార్థి మేనక, చిత్తూరులో జరిగిన కో-కో పోటీల్లో చిట్టి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఉపాధ్యాయులు, తల్లితండ్రులు విద్యార్థులను అభినందించారు.

తెగిన కల్వర్టులను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తాం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సోమల, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): భారీ వర్షంతో కొట్టుకుపోయిన కల్వర్టులను యుద్ధప్రాతిపదికన తిరిగి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో భారీ వర్షాలపై ఆయన సమీక్షించారు. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు నివేదించాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నాడు-నేడు పనులు పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలోని ప్రభుత్వ కాలనీల్లో మూడు సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. భూసమస్యలు లేకుండా తహసీల్దారు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పొలాల వద్దకు దారి సౌకర్యాలపై ప్రత్యేక సర్వేలు చేసి సమస్యలు పరిష్క రించాలన్నారు. ఈ నేపథ్యంలోనే వల్లిగట్ల సోమప్పచెరువు తెగిపోయి ఐదేళ్లు అవుతున్నా కట్టనిర్మాణం జరగలేదని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. పెద్దఉప్పరపల్లె - సోమల రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నిరాజ్, ఎంపీడీవో నారాయణ, ఎంఈవో శివరత్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి





పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు - పిడుగుపాటుకు మృతి చెందిన దూడ

రొంపిచెర్ల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు ఓ దూడ మృతి చెందింది. పట్టణంలోని రాములుగుడి వీధికి చెందిన రైతు కృష్ణయ్య తనఆవులను మేతకోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం ఆవులను, దూడను చెట్టు కింద కట్టేసి భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఇంటివద్దే ఉండిపోయాడు. వర్షం తగ్గాక వెళ్లి చూడగా పిడుగుపాటుతో దూడ చెట్టుకింద చనిపోయి ఉండటాన్ని గుర్తించాడు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాడు. వారు వచ్చి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని కామినేపల్లె గ్రామసమీపంలో పిడుగుపాటుకు గుర్రై రైతు సుబ్రమణ్యానికి చెందిన రూ.90వేలు విలువచేసే ఆవు మృతిచెందింది. పొలాలవద్ద షెడ్డు పక్కన పిడుగుపడడంతో అక్కడేవున్న ఆవు మృతి చెందినట్లు బాధితరైతు ఆవేదన వ్యక్తంచేశాడు. తమకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

మహిళా సాధికారత పెంచడమే కూటమి ధ్యేయం



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ఎన్డీయే కూటమి ప్రధాన ధ్యేయం మహిళా సాధికారత పెంచడ మేనని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో మంగళవారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళా పొదుపు సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికకి ప్రభుత్వం మెప్మా బజార్లను నిర్వహిస్తోందన్నారు. చేతివృత్తులు, కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆయా వృత్తులను, మహిళలను ప్రోత్సహించాలని పీఎస్ఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, కౌన్సిలర్లు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అన్నెమ్మగారిపల్లె వీధుల్లో వర్షపు నీళ్లు



సోమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెమ్మగారిపల్లె ప్రధాన వీధులు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే కల్వర్టులు పూడ్చివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఈ గ్రామానికి సమీపంలోని వడ్డి రామా పురం - అన్నెమ్మగారిపల్లె మార్గమధ్యంలోని కురవపల్లెకుంట నిండిపోయింది. కట్ట తెగిపోయేలా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అదే జరిగితే అన్నెమ్మగారిపల్లె జలమయం అవుతుందని అధి కారులు స్పందించి గ్రామంలోని కల్వర్టు వద్ద పూడికలు తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

'నా ఇంటి స్థలం కబ్జా చేశారు'

వైసీపీ నాయకుడిపై ఫిర్యాదు



ఇంటి పట్టా చూపిస్తున్న మంగమ్మ

పుంగనూరు, అక్టోబరు22 (ఆంధ్ర జ్యోతి): తన ఇంటి స్థలాన్ని వైసీపీ నాయకుడు కబ్జా చేసి గొడవకు దిగుతున్నాడని బాధితురాలు పుంగనూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు.. 2009లో అప్పటి ప్రభుత్వం పుంగనూరుకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య మంగమ్మకు బాలాజీ నగర్‌లో ఇంటి స్థలం కేటాయించింది. ఆమె ఇంటి నిర్మాణానికి పునాది వేసింది. తర్వాత ఆర్థిక సమస్యలతో పనులు ఆపేసింది. 2019లో భీమగానిపల్లె పంచాయతీలోని రాంపల్లె, శాంతినగర్, బాలాజీకాలనీ, జగనన్న కాలనీలో ఇళ్లస్థలాల మార్కెట్ ధర అధికంగా ఉండటంతో వైసీపీ నాయకులు ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని బినామీ పేర్లపై పట్టాలు చేయించి విక్రయాలు చేసి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రధాన రోడ్డుకు సమీపంలో ఉన్న టీడీపీ అభిమాని మంగమ్మ ఇంటి స్థలాన్ని రాంపల్లెకు చెందిన బి.శ్రీనివాసులు కుమారుడు రాజ ఆక్రమించి గొడవ చేస్తున్నాడు. ఇల్లు కట్టనీయకుండా పోలీసు కేసులు పెట్టి నానని బెదిరిస్తూ అడ్డుకుంటున్నాడు. ఈ విషయంపై గతంలో పలుమార్లు రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా వైసీపీ నాయకుల ఒత్తిడితో తనకు న్యాయం జరగ లేదని వాపోయింది. నూతన ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని తహసీల్దార్ రాముకు వినతిపత్రం ఇచ్చానని బాధితురాలు మంగమ్మ తెలిపారు.

ఓపెన్ స్కూల్‌కి దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాళ్లబూదుగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి నేషనల్ ఓపెన్ స్కూల్ ప్రారంభమైందనిహెచ్ఎం రామచంద్రయ్య తెలిపారు. చేసుకోవచ్చని వివరించారు. వివరాలకు ప్రధానోపాధ్యాయులు 9000142435 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రి హోమియోపతి అధికారి నాగేనాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కొత్తయిండ్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు, వైద్యసిబ్బంది, ఉపాధ్యా యులు హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వేడినీటిని తాగాలని, నాణ్యమైన ఆహారపదార్థాలను తీసుకోవాల్సి ఉందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం రాజు, వీఆర్వో అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెగిన కల్వర్టు రూటు మార్చిన ఆర్టీసీ బస్సులు

సోమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) సోమల మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నంజంపేట - సోమల మార్గంలోని జీడిరేవుల వంకపై తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో మంగళవారం నుంచి సోమల నుంచి పెద్దఉప్పరపల్లెకు పొదలకుంటపల్లె, సూరయ్యగారిపల్లె, తుగడం వారిపల్లె, ఎం.వడ్డిపల్లె మార్గంలో పుంగనూరు డిపో నుంచి బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు.

గార్గేయ నది దాటకండి: ఎస్ఐ

సోమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దఉప్పరపల్లె సమీపంలో ప్రవహిస్తున్న గార్గేయనదిపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు కొట్టుకుపోవడంతో నది అవతలి వైపు ప్రజలు నదిని దాటడానికి ప్రయత్నం చేయరాదని ఎస్ఐ శివశంకర సూచించారు. మంగళవారం గార్గేయనది పరిసర ప్రాంతాల ప్రజలను ఆయన కలసి ముందస్తు సూచనలు చేశారు. వర్షాల దృష్ట్యా నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

భూసమస్యలే అధికం

సదుం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 79 ఎ.చింతమాకులపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో స్థానికుల నుంచి మొత్తం 69 అర్జీలు అందినట్లు తహసీల్దారు ఎస్.ఎం.హుస్సేన్ తెలిపారు. అందులో భూసమస్యలపైనే అధికంగా అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్, సర్పంచ్ మల్లికార్జున నాయుడు, పంచాయతీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సదుం విద్యార్థులు



సదుం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సదుం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు మంగళవారం ఆ పాఠశాల హెచ్ఎం జైకుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19న చౌడేపల్లెలో అండర్-17 బాలబాలికలకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. అందులో సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో పది, తొమ్మిది తరగతులు చదువుతున్న ఎస్.సోఫియా అంజుమ్, జి.సుజిత్ కుమార్ ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

అదృశ్యమైన వ్యక్తి ఇల్లు చేరాడు



సదుం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి ఎట్టకేలకు మంగళవారం స్వగ్రామానికి చేరాడు. మతిస్థిమితం లేని సోమశేఖర్ (48) ఈ నెల 19న సాయంత్రం ఇంటి నుంచి అదృశ్యమైన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సోమ శేఖర్ అదృశ్యమైన విషయం వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో సదుం వాసి, ఆటో డ్రైవర్ అయిన బావాజాన్ పులిచెర్ల వద్ద సోమశేఖర్‌ను గుర్తించాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సోమశేఖర్‌ను ఇంటికి తీసుకెళ్లారు.

రీసర్వేలో భూసమస్యలపై గ్రామసభ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తంలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాధవరాజు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. రైతుల భూసమస్యల పరిష్కారం కోసమే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామాంజులు, టీడీపీ నాయకులు మంజునాథరెడ్డి, బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకెంవారిపల్లిలో..

పలమనేరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకెంవారిపల్లి రెవెన్యూ గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ భూసమస్యలపై తహసీల్దార్ అన్నునాథన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, వీఆర్ఓ, ఇతర రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచండి : కలెక్టర్



మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలన్నారు. తాగునీటి ట్యాంకును ఎప్పటి కప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రహరీ పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. మధ్యా హ్న భోజనం నిర్వాహకులు, పారిశుధ్య కార్మికుల జీతాలు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి హెచ్ఎం తీసుకెళ్లారు. అంతకు ముందు మతుకువారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు మం జూరు చేయాలని కాంట్రాక్టర్ శివారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పం దించారు. ఆయన వెంట తహసీల్దార్ జయ సింహ, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు సిద్ధ రామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎం వాణిశ్రీ, సర్పంచ్‌లు షకూర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు వినతి**

మంగళంపేట సమీపంలో వర్షానికి కూలిపోయిన కల్వర్టు నిర్మాణం, గ్రామీణరోడ్లకు ఇరువైపులా కమ్ముకున్న ముళ్ల కంపల తొలగింపు, పులిచెర్ల ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయ నాయుడు, వెంకటరమణ, రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

'ఉల్లాస్'పై ప్రత్యేక దృష్టి: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల పైబడిన నిరక్షరాస్యులను.. అక్షరాస్యులను చేసి.. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత పెంచేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఉల్లాస్ అమలుపై కీలక శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, మండలస్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా కమిటీలు పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమం మూడేళ్లపాటు జరుగుతుందని, తొలిదశలో 9,078 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్, క్లస్టర్ కోఆర్డినేటర్లతో సర్వే చేసి నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. ప్రతి 10మందికి ఒక వలంటీర్ టీచర్ ఉండాలని తెలిపారు. వారికి జిల్లా, మండలస్థాయిలో శిక్షణ ఇవ్వాలని, నవంబరు ఒకటో తేదీనుంచి సాయంత్రం రెండు గంటలపాటు తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. తరగతులు పూర్తయ్యాక అసెస్‌మెంట్ టెస్టులు ఉంటాయని వివరించారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, వయోజయ విద్యశాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి, డీఎల్డీవో రవికుమార్, డీపీవో పార్వతి, ఐసీడీఎస్ పీడీ హైమావతి, డీఆర్డీఏ ఏపీవో రవి పాల్గొన్నారు.

రూ.175కోట్లతో నీవానదికి రిటైనింగ్ వాల్

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'వర్షాలు కురిసినప్పుడల్లా నీవానది పరివాహక ప్రాంతాల్లోని జనం తమ ఇళ్లల్లోకి నీళ్లు వస్తాయని భయంతో ఉంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రూ.175 కోట్లతో నదికి రిటైనింగ్ వాల్ నిర్మించడానికి అంచనాలను తయారు చేసి సీఎం చంద్రబాబుకు ఇచ్చాం' అని ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. మంగళవారం నీవానది పరివాహక ప్రాంతాలైన తేనబండ, తేనబండ రోడ్డు, వీరభద్రకాలనీ, వీరభద్ర ఆలయం, సంతపేట లిల్లీ బ్రిడ్జి, మీ-సేవ రోడ్డు, కట్టమంచి రిక్షాకాలనీల్లో ఆయన పర్యటించారు. నదిలో జరుగుతున్న పూడికతీత పనులను, దోబీఘాట్‌ను పరిశీలించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కారానికి అధికారులతో చర్చించారు. మీ-సేవ కేంద్రం వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని మహిళలు ఫిర్యాదు చేయగా.. గస్తీ పెంచాలని పోలీసులకు సూచించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేషకుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఉమ్మడి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


నీవానది పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

మూడు రోడ్డు ప్రమాదాలు : నలుగురికి గాయాలు


టైరు పగలడంతో రోడ్డుపై ఆగిన గ్రానైట్ లారీ

పెనుమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. గుట్టకిందపల్లె వద్ద గాగమ్మగారిపల్లెకు చెందిన కేశవులునాయుడు పెనుమూరు నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమవడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. జట్టిగుండ్లపల్లె దళితవాడకు చెందిన పండయ్య రోడ్డు పక్కన వెళుతుండగా పెనుమూరు వైపుగా వెళుతున్న గ్రానైట్ లారీ టైరు పేలి పైకి దూసుకురావడంతో తగిలి తీవ్ర రక్తగాయాలయ్యాయి. అతడిని ఆటోలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మఠంపల్లె వద్ద చిత్తూరు నుంచి పెనుమూరు వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో చెరువుముందరఊరు గ్రామస్తులు ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంతలను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి మండలంలో 15వేల మందికి తగ్గకూడదు

టీడీపీ సభ్యత్వంపై పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపు

చిత్తూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి మండలంలో 15వేల మందికి తగ్గకుండా టీడీపీ సభ్యత్వం నమోదు కావాలని పార్టీ శ్రేణులకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన పూతలపట్టు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ పరంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అవసరమయ్యే సహకారం అందిస్తానని చెప్పారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కోదండయాదవ్, నేతలు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, జనార్ధన్ గౌడ్, ధరణి, చిత్రా నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన కుప్పలుగా మట్టి

● ఇబ్బందుల్లో వాహన దారులు

పాలసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నుంచి పాలసముద్రం వరకు ఓ ప్రైవేటు టెలికాం సంస్థ నిర్వాహకులు కేబుల్ వేయడానికి బీటీరోడ్డును ఆనుకుని గొయ్యి తీసి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. మండలంలోని ఎస్‌వి న్‌పురం నుంచి బలిజకండ్రిగ వరకు 13 కిలోమీటర్ల మేర ఉన్న సింగిల్ రోడ్డులో ఈ టెలికాం సంస్థ సిబ్బంది గాడి తీసి పైప్‌లైన్‌లో కేబుళ్లను అమర్చారు. అనంతరం సరిగా మట్టి పోయక పోవడంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు గాడిలో వాహనాల టైర్లు దిగి కూరుకు పోతున్నాయి. గాడిలో నుంచి తీసిన మట్టిని తారు రోడ్డుపై చిందరవందరగా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనాదారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు.అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

పేరుకే రౌండ్ ది క్లాక్ సేవలు

గుడిపాల పీహెచ్‌సీలో రాత్రయితే పత్తాలేని వైద్యులు ● ఇబ్బంది పడుతున్న రోగులు



గుడిపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పేరుకే రౌండ్ ది క్లాక్ సేవలు. రాత్రిపూట వైద్యులు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిత్తూరు - వేలూరు, బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో రాత్రివేళ ప్రమాదాలు జరిగితే ఈ ఆస్పత్రికే మొదట వస్తారు. ఇక్కడేమో రాత్రయితే వాచ్‌మేన్, నర్సులు తప్ప డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోయే స్థితిలో ఉన్నా ఇంజెక్షన్ వేసి.. చిత్తూరుకు రెఫర్ చేస్తున్నారని వాపోతున్నారు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నారని తెలిపారు. ఇకనైనా రాత్రివేళల్లో ఆస్పత్రిలో వైద్యాధికారి ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బంగారమ్మకు పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు.

..అయినా నీడనిస్తోంది



1999లో కురిసిన భారీ వర్షాలకు దుర్గా హోటల్ ఎదురుగా ఉన్న వేపచెట్టు ఓ పక్కకు వాలిపోయింది. వేర్లు తేలిపోయాయి. అందరూ పడిపోతాదనుకున్నారు. కానీ అది మాత్రం కాసింత పట్టు చిక్కడంతో ఏటవాలుగా నిలబడింది. ఇలా ఎన్నాళ్లుంటుందో తెలియదు కానీ.. తన వద్దకు వచ్చిన వారికి మాత్రం చల్లటి నీడనిస్తోంది.

\- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా



ఫాల్కన్ వాహనం నుంచి పర్యవేక్షిస్తున్న నిత్యబాబు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానా విధిస్తామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. మంగళవారం ఫాల్కన్ వాహనంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనులను గుర్తించారు. ఈ వాహనం ద్వారా అనుమానాస్పద వ్యక్తులను కూడా సకాలంలో పట్టుకునే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తూ కనిపిస్తే 94910 74515 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

సిమెంటు రోడ్డు మంజూరు చేయండి



విజయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమకు సిమెంటు రోడ్డు మంజూరు చేయండని నారపరాజుకండ్రిగ వాసులు కోరుతున్నారు. గ్రామంలోని రాములు గుడి నుంచి జయమ్మ ఇంటి వరకు సుమారు 35 మీటర్లు మంజూరు చేయాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. గ్రామం.. టీడీపీ కంచుకోటగా పేరు గాంచినా సిమెంటు రోడ్డుకు మోక్షం రాలేదని వాపోయారు. ఒకే పంచాయతీలో రెండు వర్కులు మంజూరు చేసుకున్నారని, తమ విన్నపాన్ని పట్టించుకోవడం లేదని స్థానిక టీడీపీ నాయకులూ విమర్శిస్తున్నారు.

బియ్యం లారీ బోల్తా



బంగారుపాళ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ బియ్యం లారీ బోల్తాపడిన సంఘటన సోమవారం రాత్రి మొగిలి ఘాట్ వద్ద జరిగింది. పలమనేరు నుంచి టమోటా లోడుతో చెన్నైకి వెళుతున్న మినీ లారీని బెంగళూరు నుంచి బియ్యం లోడ్డుతో చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి మొగిలి ఘాట్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో బియ్యం లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడగా, టమోటా లోడుతో ఉన్న మినీ లారీ డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలవలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


పాఠశాల ఆవరణలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగడానికి, మధ్యాహ్న భోజనం అనంతరం చేతులు, ప్లేట్లు కడుగుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'తాగడానికి గుక్కెడు నీళ్లు ఇవ్వండి సారూ..' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పాఠశాల వద్దకు చేరుకుని తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆంధ్రజ్యోతికి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



నగరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలను టీడీపీ నాయకులు మంగళవారం వితరణ చేశారు. ఎమ్మెల్యేగా భానుప్రకాష్ గెలిచాక ఆయన్ను సన్మానించడానికి వచ్చిన వారిచ్చిన నోటుపుస్తకాలు, పెన్నులను ఏకాంబరకుప్పం, సత్రవాడ, కేవీఆర్‌పేట, కరకంఠాపురం, చింతలపట్టెడ తదితర గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో టీడీపీ నాయకులు రజనీ, శ్రీనివాసులు, కరుణ తదితరులు కలిసి విద్యార్థులకు అందజేశారు. టీడీపీ హయాంలో ఆదుకోవడమే కానీ దోచుకోవడం జరగదని ఈ సందర్భంగా తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు


కేపీ శ్రీరామాపురం నుంచి ట్రాక్టర్‌లో సరఫరా చేస్తున్న ఇసుక

విజయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలించొద్దని తహసీల్దార్ కిరణ్ హెచ్చరించారు. కేవీ శ్రీరామాపురంలో కుశస్థలి నది వద్ద ఇసుకను గుర్తించామన్నారు. అవసరం ఉన్నవారందరికీ అనుమతి మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, అవకతవకలకు తావులేకుండా ఇసుక అవసరం ఉన్న వారి ట్రాక్టరు ద్వారా తరలిస్తున్నారని వివరించారు.

నోట్‌బుక్స్, పెన్నుల వితరణ



గంగాధర నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అగరమంగళం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ సహకారంతో రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు వితరణ చేశారు. అనంతరం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, సోమలరాజు ఫౌండేషన్ చైర్మన్ శివరాజు, ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎంలు రాజేంద్రరెడ్డి, గంగాధరం, ప్రోగ్రామ్ అనలిస్ట్ షాలిని పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై పర్యవేక్షణ తప్పనిసరి


రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతీ దేవి

గంగాధరనెలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీల పరిధిలో డాక్టర్లతోపాటు సిబ్బంది రోజువారీ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని డీఎంహెచ్‌వో ప్రభావతీ దేవి అన్నారు. తూగుండ్రం పీహెచ్‌సీని ఆమె తనిఖీచేసి అక్కడి రోగులతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం బంగారెడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. డాక్టర్లు దివ్య, మౌనిక, అంగన్వాడీ టీచర్ జమున, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అండర్-14 హ్యాండ్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపికపోటీలు పూతలపట్టు జడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం నిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన 26 మంది బాల, బాలికలు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపిక కమిటీ సభ్యులుగా ప్రభాకర్, శివప్రసాద్, సుధారాణి, నాగరాజు, జయక్రిష్ణ, ప్రసాద్ వ్యవహరించారు. పీడీలు రవీంద్రారెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతవాణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

రీసర్వేలోని తప్పులు సరిదిద్దుతాం

● గ్రామసభలో అధికారులు

యాదమరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుతామని మంగళవారం నుంచి ప్రారంభమైన గ్రామసభల్లో అధికారులు స్పష్టం చేశారు. యాదమరి మండలంలోని మోడిపల్లెలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ పార్థసారథి, ఆర్‌ఐ ప్రసాద్, ఏవో చరిత, సర్వేయర్ తులసి, తెలుగు మహిళ నాయకురాలు చిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుమూరు: కలిగిరి సచివాలయంలో జరిగిన గ్రామసభలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, రీసర్వే డీటీ వాణి తమ సిబ్బందితో కలిసి అర్జీలను స్వీకరించారు. అధికంగా విస్తీర్ణం తక్కువ వచ్చిందని 24 అర్జీలు రాగా, ఒకే నెంబరులో ఇద్దరు అంతకన్నా ఎక్కువ మందికి ఒకే ఎల్‌పీఎం నెంబరు కేటాయించడంపై 17, మ్యుటేషన్ కావాలని 10 అర్జీలు వచ్చాయి.

గుడిపాల: రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లెలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. చిత్తూరు డివిజనల్ సర్వేయర్ శాంతరాజ్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రూపారాణి, మండల సర్వేయర్ గోపి, కిరణ్, వీఆర్వో శోభన్‌బాబు, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి, మండల రైతు సంఘ అధ్యక్షుడు మురళీ నాయుడు, వైస్ సర్పంచ్ సరళ వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

పాలసముద్రం: సింహరాజుపురంలో గ్రామసభను తహసీల్దార్ అరుణకుమారి నిర్వహించారు. 15 మంది రైతులు తమ పాసు బుక్కుల్లో తప్పులు దొర్లినట్లు అర్జీలు సమర్పించారు. నగిరి ఆర్డీవో వెంకటరెడ్డి అధికారులకు సూచనలిచ్చారు. సర్వేయర్ గణేష్, వీఆర్వోలు తంగరాజ్,శీను, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర: అగరం పంచాయితీలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ శేషగిరిరావు, సర్వేయర్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: ఎల్లసముద్రంలో జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వో మేఘనాథం, సర్పంచ్ మమతా శ్రీరాములురెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్లు పార్థసారథి , కిరణ్ - సభలో ప్రసంగిస్తున్న తహసీల్దారు శేషగిరిరావు

సంక్షిప్తంగా..

నేడు నిండ్ర మండల మీట్

నిండ్ర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నిండ్ర మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ దీప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ వర్మ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

అఖండ రుద్ర పారాయణం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక అఖండ రుద్ర పారాయణం నిర్వహించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో మంగళవారం బాబా భక్తులు రుద్రం, నమకం, చమకం, పారాయణం చేశారు.

టపాకాయల విక్రయానికి స్థల పరిశీలన

ఐరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా వ్యాపారులు టపాకాయలు విక్రయించడానికి మంగళవారం తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్‌ఐ నరసింహులు స్థల పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఆరు దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఐరాలలో రెండు, పాటూరు సంతగేటులో నాలుగు దుకాణాలు పెట్టనున్నట్లు చెప్పారు. వీఆర్వో రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సుదారులే అమ్మాలి: సీఐ

నగరి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో లైసెన్సు పొందిన వారు మాత్రమే టపాకాయలను విక్రయించాలని సీఐ మహేశ్వర్ తెలిపారు. అనుమతులు లేకుండా అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నగరి కుశస్థలీ నది ఒడ్డున తొమ్మిది షాపులకు అనుమతిని కేవలం ఎనిమిది రోజులు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

చంద్రబాబు పాలనలోనే మహిళలకు రక్షణ

చిత్తూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు పాలనలోనే మహిళలకు రక్షణ దొరుకుతుందని తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి రోజా తన ఇష్టం వచ్చినట్లు చంద్రబాబును విమర్శిస్తే తెలుగు మహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వేలాది మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగినా నోరువిప్పని రోజా.. ఇప్పుడు మహిళల పక్షాన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రోజా నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామన్నారు.

క్రైం కార్నర్

దొంగలు బాబోయ్.. దొంగలు

విజయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ ఆవు కనిపించడం లేదని ఎల్లసముద్రం ఎస్టీ కాలనీకి చెందిన శాంతమ్మ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతవారం రూ.55వేలకు కొనుగోలు చేశానని, ఆదివారం అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని తెలిపారు. మండలంలో మేకలు, ఆవులు, స్టార్టర్ల దొంగతనాలు తరచూ జరుగుతున్నాయని పోలీసు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తవణంపల్లె మండలం వెంగనపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు భరత్‌రాజ్ పని నిమిత్తం మంగళవారం సాయంత్రం బండపల్లె సమీపాన ఉన్న ఓ ఆలయం వద్దకెళ్లి, తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. పూతలపట్టు నుంచి కాణిపాకం వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో భరత్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

500 లీటర్ల సారా ఊట ధ్వంసం

శ్రీరంగరాజపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తయ్యూరు గ్రామ సమీపంలో పోలీసులు సారా స్థావరాలపై మంగళవారం దాడులు చేశారు. 500 లీటర్ల సారాఊటను ధ్వంసం చేశారు. ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నగరి అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి కుశస్థలీ నదిలో అనుమతులు లేక, సరైన రికార్డులు లేక, వంతెన సమీపంలో ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీఐ మహేశ్వర్ పట్టుకుని, ఫైన్ వేశారు. వంతెనకు 500 అడుగుల దూరంలో ఇసుక తీసుకోవాలని, వాహన రికార్డులతోపాటు డ్రైవర్లు లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు మీరి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.